క్లుప్తంగా

12 సెం.మీ వర్షపాతం నమోదు


చిన్నటేకూరులో వర్షానికి నెలకొరిగిన జొన్న పంట

కల్లూరు: నెల రోజులుగా మోహం చాటేసిన వర్షం శనివారం రాత్రి భారీగా కురవడంతో మండలం వ్యాప్తంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కంది, జొన్న, శనగ పంటలకు జీవంపోసినట్లయ్యింది. ఈ నెల 15 వరకు శనగ పంట విత్తుకోవచ్చు అని తెలిపారు.

జంగం సంక్షేమ సంఘం కమిటీ నియామకం


జిల్లా అధ్యక్షున్ని సన్మానించిన దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని జంగం సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య తెలిపారు. జిల్లాలో జంగం సంక్షేమ వర్గాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మండలంలోని శకునాల గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. సమావేశంలో మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా మనోహర్‌శర్మ, కార్యదర్శిగా గంగాధరయ్య, కోశాధికారిగా మల్లికార్జునయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారితో పాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా జంగం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు జేసీ మల్లికార్జునయ్య, గౌరవాధ్యక్షులు మల్లేశ్వరయ్య, జిల్లా సోసియల్ మీడియా ఇన్‌చార్జ్ వీరశంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరయ్యను సన్మానించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆదివారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఉదయం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుంటారన్నారు.

నేడు సి.బెళగల్‌లో ..

సి.బెళగల్: స్థానిక గ్రామ సచివాలయం – 1 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరైన గ్రామంలోని ఇళ్లకు తిరుగుతూ, ప్రజల సమస్యలను తెలుసుకోవటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎల్లమ్మకు వెండి శఠగోపం బహూకరణ


వెండి శఠగోపాన్ని ఈఓ దినేష్‌కు అందజేస్తున్న హరిణి కుటుంబ సభ్యులు

కర్నూలు సిటీ: నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మకు 43.5 తులాల వెండి శఠగోపం కానుకగా అందజేశారు. ఆదివారం జోహరాపురానికి చెందిన హరిణి కుటుంబ సభ్యులు వెండితో తయారు చేయించిన శఠగోపాన్ని ఆలయ ఈఓ దినేష్‌కు అందజేశారు. అనంతరం వారు అమ్మవారికి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అలాగే కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌కు చెందిన సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు ఎల్లమ్మ ఆలయానికి సెఫ్ లాకర్ (బీరువా)ను బహూకరించారు.

వచ్చేనెల 2 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్) : డిసెంబర్ 2,3 తేదీలోల కర్నూలులో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ 47వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో వారు మాట్లాడుతూ..జిల్లాలో తీవ్ర కరువు నెలకొ న్న పరిస్థితుల్లో విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలన్నారు. ఒక్కో విద్యా ర్థి స్కాలర్‌షిప్ కింద రూ.10 వేలు ఇవ్వాలన్నారు.

సుంకేసులలో 0.461 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేసినట్లు ఆదివారం డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.461 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

ప్రత్యేక ప్రచారం.. ఓటరు చైతన్యం

- కోడుమూరు నియోజకవర్గంలో 2,31,940 మంది ఓటర్లు
- కొత్తగా ఓటరు నమోదుకు 1,188 దరఖాస్తులు
- రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్


దిన్నెదేవరపాడులో ఓటరుతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ హరిప్రసాద్, తహసీల్దారు శివరాముడు


కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు జాబితా చూసుకుంటున్న ఓటర్లు


పాణ్యంలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్

కర్నూలు సిటీ: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటరు నమోదుపై శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద డ్రాఫ్ట్ ఓటరు లిస్టు అందుబాటులో ఉంచారు. ఈ జాబితాలో ఓటర్లకు ఏవైన అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు అవకాశం కల్పించారు. అలాగే కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. కాగా ఈ శిబిరాల్లో ఓటర్ల నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి.

275 పోలింగ్ స్టేషన్లు

కోడుమూరు నియోజకవర్గంలోని గుడూరు, సి.బెళగల్, కర్నూలు అర్బన్, రూరల్, కోడుమూరు మండలాల పరిధిలో ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 2,31,940 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,16,770, మహిళలు 1,15,157, ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 275 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి అర్హులైన వారికి కొత్తగా ఓటరుగాను (ఫారం–6), నాన్–రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్‌ఆర్‌ఐలు) (ఫారం–6ఏ) నుంచి, ఎలక్ట్రోరల్ రోల్‌లో ఓటరు ఏదైన సమాచారంలో మార్పులు చేసేందుకు (ఫారం–7), దరఖాస్తుదారు (ఓటరు) పేరు, ఫోటో, వయసు, ఈపీఐసీ నెంబరు, చిరునామా, పుట్టిన తేది, లింగంలో మార్పులు చేసేందుకు (ఫారం–8) ఫారాలను పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి స్వీకరించారు. దీంతో పాటు 18 సంవత్సరాల వయస్సు ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారికి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు 275 పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌ఓలకు ఫారం–6కి 950, ఫారం–6ఏ 89, ఫారం–8 దరఖాస్తులు 149 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలిన

కోడుమూరు నియోజకవర్గంలోని కర్నూలు రూరల్, అర్బన్ మండలాల పరిధిలోని ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను నియోజకవర్గ ఆర్‌ఓ, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, కర్నూలు రూరల్ తహసీల్దారు శివ రాముడులు పరిశీలించారు. దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లోని పోలింగ్ స్టేషన్, స్కంద వెంచర్‌లోని ఓటర్లతో ఆర్‌డీఓ మాట్లాడారు. అదే విధంగా అర్బన్ పరిధిలోని 39వ వార్డులోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు.

ఓటు హక్కు నమోదుకు 106 దరఖాస్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉన్న 49 పోలింగ్ కేంద్రాలలో ఆదివారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ శేషఫణి, ఏఎస్‌ఓ ఆదినారాయణ తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో కొత్తగా ఓటు హక్కు కోసం (ఫారం – 6) 106 దరఖాస్తులు, మార్పు చేర్పులకు (ఫారం – 7) 13, తొలగింపునకు 21 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి, కోడుమూరులలోని పోలింగ్ బూత్‌లలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ జయన్న పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలకు సూచనలు చేశారు. రెండురోజుల్లో మండలంలో కొత్త ఓటరు నమోదు కోసం 360 దరఖాస్తులు రాగా, తొలగింపునకు 27, మార్పుల కోసం 55 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

రెండో రోజు కొనసాగిన దరఖాస్తుల వెల్లువ

పాణ్యం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ఓటరు నమోదుపై ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండో రోజైన ఆదివారం పాణ్యం నియోజకవర్గంలో నిర్వహించిన క్యాంపైన్‌లకు దరఖాస్తుల వెల్లువ కొనసాగిందని పాణ్యం తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ తెలిపారు. ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నియోజకవర్గంలో 1,539 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఫారం–6 కి 838, ఫారం6ఏ 02, ఫారం–6బీ 28, ఫారం–7కి 314, ఫారం–8కి 357 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు.

కల్లూరు: మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ టీవీ రమేష్ బాబు ఆదివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఫారం6–338, ఫారం7–114, ఫారం 8–159 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

ఓటరు జాబితా సరిచూసుకోండి

గడివేముల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద డ్రాఫ్ట్ ఓటరు లిస్టు అందుబాటులో ఉందని, ఓటర్లు సరిచూసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గడివేములతో పాటు, బిలకలగూడూరు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మండలంలో 42 పోలింగ్ బూత్‌లకు గాను కొత్తగా ఓటును నమోదు కొరకు 146 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

కొత్తూరులో ప్రత్యేక పూజలు


నాగులకట్టకు పూజలు చేస్తున్న భక్తులు,


అడిషినల్ ఎస్పీ దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న సిబ్బంది, అర్చకులు

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అష్టమి సందర్భంగా గతంలో కంటే భక్తుల రద్దీ తగ్గిందని ఈఓ రామకృష్ణ తెలిపారు చెప్పారు. దాదాపుగా 2వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. దర్శనానికి గంట నుంచి గంటన్నర వరకు సమయం పట్టిందన్నారు. శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో ఆదివారం నంద్యాల జిల్లా ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు కుటుంబ సమేత పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ చరిత్ర గురించిఅర్చకులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి దుర్మరణం


మద్దిలేటి గౌడు(ఫైల్)

కర్నూలు సిటీ: కర్నూలు–సుంకేసుల రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కర్నూలు రూరల్ మండల పరిధిలోని తొలిశాపురం గ్రామానికి చెందిన ఈడిగ నారాయణ రెండో కుమారుడు మద్దిలేటి గౌడు(42) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గీత కార్మికుడైన మద్దిలేటి ఆదివారం సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామ సమీపంలోని ఈత చెట్లకు కల్లు కోసం గీతగీసేందుకు వెళ్లి.. తిరిగి వస్తుండగా ఆర్.కె దుద్యాల స్టేజ్, గిరిమోజు వాగు మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దగ్గరలోని పొలాల్లోని అక్కడికి వచ్చే సరికి మద్దిలేటి మృతిచెంది ఉన్నాడు. విషయాన్ని గ్రామస్తుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో అక్కడి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదంపై తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

తొలిశాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి గౌడు వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరుడుగా ఉండేవారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఘటనకు కారణమై వాహనాన్ని గుర్తించేందుకు ఎమ్మెల్యే స్వయంగా సీసీ కెమెరాలను పరిశీలించారు. మద్దిలేటి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన


ఎల్లమ్మ ఆలయంలో దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప

కర్నూలు సిటీ: వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయాన్ని రూ.3 కోట్లతో పునర్నిర్మించనున్నారు. ఈ మేరకు ఆదివారం దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం పునర్నిర్మాణ పనుల గురించి ఆలయ ఈఓ దినేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయం నిర్మాణం కోసం ప్రస్తుతం సుమారుగా 40 టన్నుల స్టోన్‌ను తెప్పించామని, ప్రస్తుతం శిల్పితో పాటు, వారి లేబర్ కోసం తాత్కలిక షెడ్లు నిర్మించే పనులు చేపడుతున్నామని ఈఓ వివరించారు. అదే విధంగా ఆలయాన్ని పునర్నిర్మాణ దాత చెన్నైకి చెందిన సినీ నిర్మాత రాజ్‌కుమార్ త్వరలోనే ఇక్కడి రానున్నారని, శిల్పులు సైతం తమిళనాడు రాష్ట్రం నుంచి రానున్నారని తెలియజేశారు.

కేవీఆర్ లెక్చరర్‌కు స్వర్ణకంకణ పురస్కారం


పురస్కారం పొందిన డా.బాశెట్టి లత

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ బాశెట్టి లతకు స్వర్ణకంకణ పురస్కారం లభించింది. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ ఫిలింభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెను సత్కరించారు. డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, భవాని సాహిత్య వేదిక అధ్యక్షులు కరీంనగర్ శ్రీపొట్లూరి హరికిష్ణ, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు డా.అక్కిరాజు సుందర రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో స్వర్ణకంకణాన్ని అందజేసినట్లు ఆమె తెలిపారు.

కంటపడితే వెంటపడుతున్నాయ్!


గడివేములలో గుంపులుగా రోడ్డు అడ్డంగా ఉన్న కుక్కలు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములతో పాటు గడిగరేవుల, చిందుకూరు, దుర్వేశి, బిలకలగూడూరు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో వీధుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు, వాహనదారులు రోడ్లపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెంటపడటంతో కింద పడి గాయాల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు ప్రజల వెంట పడి భయాందోళన కలిగిస్తున్నాయి. కొత్త వ్యక్తులు వీధుల్లో నడిచి వెళ్లేందుకు సాహసించడం లేదు. శునకాలు చిన్న పిల్లల మీదకు వెళ్లి గాయాలపాలు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తప్పించి కుక్కలను వేరే చోటికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

బలిజ, కాపు భవన నిర్మాణం పూర్తి చేయాలి

కల్లూరు: బలిజ, కాపు భవనం నిర్మాణం పూర్తి చేయాలని కర్నూలు బలిజ, కాపు సంఘం నాయకులు కోరారు. ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కోనేటి చంద్రబాబు, సి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, గంగాధర్, చంద్రమోహన్, రమణమూర్తి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో కారు ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన నారాయణ పని ముగించుకొని ఇంటికి వస్తున్న తరుణంలో హైవేపై వెళ్తున్న ఓ గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో నారాయణకు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. గుర్తు తెలియన కారు కోసం పోలీసులు గాలిస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో సూచించారు. అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

కురువలు ఐక్యంగా ఉండాలి

కల్లూరు: కురుబ, కురువ, మాదారి కురువ, మాదిసి కురవలందరూ చైతన్యవంతులై ఐక్యతగా ఉండాలని ఆ సంఘం నగర కమిటీ అధ్యక్షుడు ఎల్లప్ప అన్నారు. ఆదివారం కల్లూరులోని శ్రీ శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో నగర కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వనభోజనాల క్యాలెండర్ల లోగో తయారు చేయాలని, కురువల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని తీర్మానించారు. ప్రతి నెల రెండో ఆదివారం కల్లూరులో శ్రీ శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మహేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్టీసీ నారాయణ, నగర కమిటీ కోశాధికారి లోకరాజు, ఉపాధ్యక్షులు వెంకటకృష్ణ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక జొహరాపురం రోడ్డులో ఉన్న అప్సరానగర్‌లో నివసించే నల్లబోతుల మహేంద్ర కుమార్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. గత నెల 28 వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లిన అతను ఇంత వరకు ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజల శాంతి భద్రతలే ముఖ్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- శరీన్‌నగర్‌లో పోలీసు ఔట్ పోస్టును ప్రారంభం


పోలీసు ఔట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు : ప్రజల శాంతి భద్రతలకు వైఎస్సార్‌సీపీ అధిక ప్రాధాన్యతనిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో వార్డు నాయకుడు శివారెడ్డి సహకారంతో నిర్మించిన పోలీసు ఔట్ పోస్టును నాల్గవ పట్టణ ఎస్‌ఐ పెద్దయ్య నాయుడుతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలోని ప్రజలకు ఎల్లప్పుడు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి అల్లర్లు జరకుండా ముందు జాగ్రతగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, నాయకులు నామద్దిలేటి, తిరుపాల్, భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ, నుజ్జయిన కారు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని జి.సింగవరం గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. ఆదివారం సెలవు కావడంతో ఏడుగురు స్నేహితులు కలిసి సరదాగా కర్నూలు నగరానికి చెందిన ఓ కారులో సుంకేసుల బ్యారేజీకి వెళ్లేందుకు బయలు దేరారు. సింగవరం గ్రామం దాటిన తరువాత మలుపు దగ్గర ఎదురుగా (సుంకేసుల వైపు నుంచి) వస్తున్న లారీ కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. లారీ ముందు చక్రం ఊడిపడింది. ప్రమాదంలో ధర్మపేటకు చెందిన హర్షకుమార్ (18) అక్కడికక్కడే మృతిచెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయాలైన వారిని చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. అయితే ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.

కర్నూలులో 'కిసాన్' జాతీయ మహాసభలు


మాట్లాడుతున్న కె.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు సిటీ: వచ్చే నెల 15,16,17 తేదీల్లో కర్నూలు జిల్లా కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలను నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, తెలుగు దేశం పార్టీ మంత్రాలయం ఇన్‌చార్జ్ పి.తిక్కారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు. మహాసభలు నిర్వహించడం వల్ల రైతు ఉద్యమాలకే కాకుండా, కర్నూలు జిల్లా రైతాంగానికి కూడా ఉపయోగకరమన్నారు. సమావేశాలకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఆహ్వాన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.తిక్కారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్‌గా జి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.ఏ గఫూర్, అర్జా రామకృష్ణ, మరో వంద మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫిష్ ఆంధ్ర కేంద్రాల తనిఖీ


ఖానాఖజానాలోని ఫిష్ డెలీషియస్ నిర్వాహకుడు రంగన్నతో మాట్లాడుతున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఆదివారం మత్స్యశాఖ అధికారులు తనిఖీ చేశారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జిల్లా ఉప సంచాలకలు శ్యామల, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ తదితరులు ఫిష్ ఆంధ్ర రీటైల్ అవుట్‌లెట్స్‌ను పరిశీలించారు. ఖనాఖజానాలోని ఫిష్ అంధ్ర డెలీషియస్, మద్దూర్‌నగర్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లోని రీటైల్ అవుట్‌లెట్ కేంద్రాలను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.

గాజాలో శాంతి నెలకొల్పాలి

కర్నూలు(రాజ్‌విహార్): పాలస్తీనాలోని గాజాలో శాంతి నెలకోల్పాలని ఆల్ మైనారిటీ వెల్ఫేర్ సంఘం కన్వీనర్ రోషన్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల వేల మంది చిన్నారులు, అమాయకులు మృత్యువాత పడుతున్నారని, ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకొని శాంతి నెలకొల్పాలని విన్నవించారు.

కిడ్నీ జబ్బులపై అవగాహన పెరగాలి


డాక్టర్ సాయివాణిని సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ జబ్బులపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని నెఫ్రాలజిస్టు డాక్టర్ వై. సాయివాణి అన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో కిడ్నీ జబ్బులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో కిడ్నీ జబ్బులతో బాధపడే వారి సంఖ్య అధికమైందన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడే వారు క్రియాటినిన్ పెరిగితే తప్పనిసరిగా డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి కారణం బీపీ, షుగర్ జబ్బులు నియంత్రణలో లేకపోవడం, ఊబకాయం, వంశపార్యంగా కిడ్నీ జబ్బులు రావడమేనన్నారు. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవడానికి ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ధూమ, మద్యపానాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం కిడ్నీ దెబ్బతిన్న వారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సులభతరమైందన్నారు. మంచి మందులు సైతం అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనంతరం ఆమెను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ రవీంద్ర తదితరులు సన్మానించారు.